కష్టపడి చదివి.. అనుకున్నది సాధించండి!

- చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం
- ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలి
- అంబర్‌పేట ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు కలెక్టర్ హితబోధ

సిటీబ్యూరో, జూలై 9(నమస్తే తెలంగాణ): చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతాయని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులకు హితబోధ చేశారు. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించి అనేక అవకాశాలను దక్కించుకోవాలని సూచించారు. అంబర్‌పేట ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. భోజన వసతులు, పరిసరాలు, ఇబ్బందులపై విద్యార్థులతో ఆరా తీశారు. తాను కూడా తెలంగాణ బిడ్డనే అని మేట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని చెప్పారు. జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్‌లో చదివి కలెక్టర్ అయ్యానని అన్నారు. బాగా చదువుకుంటే ప్రతి ఒక్కరూ ఉన్నతస్థానానికి వెళ్లగలుగుతారని సూచించారు. చదువును కష్టంగా భావించకుండా ఇష్టంగా చదవాలని చెప్పారు. కష్టపడి చదివి అనుకున్నది సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖాధికారి ఆశన్న ఉన్నారు.

బీసీలు 60% ఉన్నా అడుక్కోవాల్సిందేనా..?

బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ప్రతాని రామకృష్ణ గౌడ్

నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రతాని రామకృష్ణ గౌడ్

ఖైరతాబాద్, జూలై 9: రాష్ట్ర జనాభాలో బీసీలు 60% ఉన్నా హక్కుల కోసం అడుక్కోవాల్సి వస్తున్నదని తెలంగాణ బీసీ సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ గౌడ్ అన్నారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారత సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా తెలంగాణ ఫిలిం చాంబర్ చైర్మన్, ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకులు, డిస్ట్రిబ్యూటర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్ రావు, గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, తెలుగు రాష్ట్రాల కౌన్సిల్ అధ్యక్షులుగా కొవ్వూరి భాస్కర్ రావు, ఉపాధ్యక్షులుగా గురు రాజ్, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా ప్రముఖ దర్శకుడు సముద్ర, రాజు, కార్యదర్శులుగా ఆకుల బాలకృష్ణ, పొలాస వాసు, భక్తవత్సలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దేశెట్టి శివ కుమార్, నగర గౌరవ అధక్షులుగా ఆర్వీ మహేందర్ కుమార్‌లు నియమితులయ్యారు. రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ పన్నెండేండ్ల నుంచి తెలంగాణ ఫిలిం చాంబర్ చైర్మన్‌గా పని చేస్తున్నాని తెలిపారు. తెలుగు చిత్ర సీమ కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను నిర్వహించానన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీలు ఆరవై శాతం ఉన్నా హక్కుల కోసం అడుక్కోవాల్సి వస్తోందన్నారు.

మెరుగైన వైద్యంతో మన్ననలు పొందాలి

- జవహర్‌నగర్‌లో పర్యటించిన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

విద్యార్థులతో ముచ్చటిస్తూ పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

జవహర్‌నగర్, జూలై 9: ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారి మన్ననలు పొందాలని, ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు వైద్యంపై నమ్మకం కలిగించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. దీర్ఘకాలిక రోగులకు సేవలు ఎలా అందిస్తున్నారని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వోన్నత పాఠశాలను మంగళవారం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ, దవాఖానను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, సహజ సిద్ధమైన డెలివరీలకు అవకాశం కల్పించాలని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెంచాలన్నారు. మలేరియా, డెంగీ విజృంభించే అవకాశం ఉందని, బీపీ, షుగర్ మందులు నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం, హాస్పిటల్ రోగులతో మాట్లాడుతూ సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, డీడబ్ల్యూ కృష్ణారెడ్డి, కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, ఎమ్మార్వో సుచరిత, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆర్ఐ శ్రీలక్ష్మి, వైద్యాధికారి సుష్మ, వైద్యా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి సమగ్ర కుల గణన యాత్ర

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

ఖైరతాబాద్, జూలై 9: తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణనను చేపట్టి బీసీ రిజర్వేషన్లును జనాభా దామాషా ప్రకారం పెంచాలని ఈ నెల 14 నుంచి 17 రోజుల పాటు సమగ్ర కులగణన సాధన యాత్ర చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపడుతామని హామీ ఇచ్చిందని, 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ చేసిందని గుర్తు చేశారు. దానిని ప్రభుత్వానికి గుర్తు చేయడానికి కామారెడ్డి నుంచే తమ యాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. కులగణన సాధన యాత్రలో బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యావంతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేశ్, గౌడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, గూడూరు భాస్కర్, సమతా యాదవ్, సంధ్య, శ్యామల, రేణుక, జయశ్రీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

రిజిస్ట్రేషన్ల ధరలు పెంచడమంటే..

పేదల సొంతింటి కలను దూరం చేయడమే

నారగోని ప్రవీణ్ కుమార్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి ప్రతం అందజేస్తున్న నారగోని ప్రవీణ్ కుమార్ తదితరులు

సిటీబ్యూరో, జూలై 9(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల ధరలు పెంచడమంటే పేద, మధ్యతరగతి ప్రజలను సొంతింటి కలకు మరింత దూరం చేయడమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచితే, స్టాంపు డ్యూటీని తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్ కుమార్ డిమాండు చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కలిసి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌ల ఐజీకి మంగళవారం వినతి పత్రాలను అందజేశారు. నారగోని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడమంటే పేద, మధ్య తరగతి ప్రజలను సొంతింటి కలకు దూరం చేసినట్లే అవుతుందన్నారు. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువను పెంచితే 7.5 శాతం ఉన్న స్టాంపు డ్యూటీని 3 శాతానికి తగ్గిస్తే ప్రజలపై భారం పడకుండా ఉంటుందన్నారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకపోతుల నర్సయ్య, జనరల్ సెక్రెటరీ పి.రంగారావు, పి. రాజులు, లక్ష్మణరావు, మంచిర్యాల ప్రెసిడెంట్ జి.వెంకటస్వామి, రంగారెడ్డి ప్రెసిడెంట్ పేరం వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల నుంచి డబ్బులు వసూలు చేసినందుకు..

కాంగ్రెస్ పార్టీ నుంచి పీఆర్ నాయుడి బహిష్కరణ

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 9: కేపీహెచ్‌బీ కాలనీలో పేదలు నిర్మించుకునే ఎల్ఐజీ గృహ నిర్మాణం వద్ద డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన పీఆర్ నాయుడి (ముత్తిరెడ్డి ఫణీంద్ర నాయుడి)ని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పీఆర్ నాయుడి ఆగడాలపై జూలై 2న 'నమస్తే తెలంగాణ దిన పత్రిక'లో 'కేపీహెచ్‌బీ కాలనీలో కాంగ్రెస్ నేత వసూళ్ల దందా...' కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ వార్త కూకట్‌పల్లిలో చర్చినీయాంశం కాగా.., కాంగ్రెస్ నేత పీఆర్ నాయుడు అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్ల వ్యవహారాన్ని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పార్టీ అధినేతల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ జరుపగా, కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని ఎల్ఐజీ 121 బ్లాక్ పునర్ నిర్మాణ పనులు చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ లీడర్‌గా పీఆర్ నాయుడు ప్లాట్‌కు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తేలింది. అలాగే, కాలనీలో పలు చోట్ల వసూళ్లకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ లీడర్‌గా చెలామణి అవుతున్న పీఆర్ నాయుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించాడు. కాగా, పీఆర్ నాయుడు వసూళ్ల బాగోతం వెనుక...తతంగాన్నంతా తానై నడిపించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిపై అతనికి సహకరించి, వసూళ్లలో వాటాలు పంచుకున్న నాయకులపై చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. వసూళ్ల వ్యవహారంలో ముఖ్య నాయకులను వదిలేశారని, స్థానికంగా పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టాన పెద్దలను, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు.

డెంగీ నియంత్రణకు ప్రత్యేక దృష్టి

చీఫ్ ఎంటమాలజీ రాంబాబు

సిటీబ్యూరో, జూలై 9(నమస్తే తెలంగాణ): పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఆదేశాల మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీలో డెంగీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం, శనివారం పాఠశాల విద్యార్థులకు డెంగీ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని, ఎగ్జిబిషన్‌తో పాటు దోమలతో వచ్చే వ్యాధులు, వాటి నివారణపై బయాలజీ టీచర్లకు అవగాహన కల్పించాలని డాక్టర్ రాంబాబు తెలిపారు. అన్ని జోన్ల కార్యాలయాల్లో వారానికోసారి సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. డెంగ్యూ పాజిటివ్ కేసులు వచ్చినటువంటి ఇళ్లలో కనీసం 30 నుంచి 50 ఇళ్లలో పైరెథ్రమ్ రసాయనంను పిచికారీ చేయాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం, ఇతర పరిశుభ్రమైన ప్రదేశాలను తనిఖీ చేసి ఇంటి యాజమానులు ఆమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఈలు, సీనియర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌లు పాల్గొన్నారు.

ఎలబ్రస్ పర్వతంపై నగర సైక్లిస్టు

సిటీబ్యూరో, జూలై 9(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన సైక్లిస్టు అంజనీ అరుదైన రికార్డు సాధించి ఔరా అనిపించింది. యూరప్‌లోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎలబ్రస్‌పై జాతీయ జెండా రెపరెపలాడించింది. రష్యాలోని అంత్యంత ఎత్తైన పర్వతం ఎలబ్రస్(5,642 మీటర్లు)ను సోమవారం అధిరోహించింది. జూలై 1న బయల్దేరి ఈ సాహసాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. కాగా, గతేడాది కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించిన విషయం తెలిసిందే. ప్రపంచంలో అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలన్ని అధిరోహించడమే లక్ష్యంగా ఆమె సాహస యాత్ర కొనసాగుతుండటం విశేషం. ఎలబ్రస్‌పై జాతీయ జెండా ఎగురవేయడం తన కెంతో సంతోషాన్నిచ్చిందని అంజనీ తెలిపారు.

ఉద్యోగాలంటూ మోసం

ఢిల్లీకి చెందిన సైబర్ ఛీటర్ అరెస్ట్

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): అరబ్ దేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన సైబర్ నేరగాడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ కవిత కథనం ప్రకారం.. ఢిల్లీకి చెందిన నిశాంత్‌కుమార్ రాయ్, ఈస్ట్ ఢిల్లీలో అర్విజ్ వెబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక కంప్యూటర్ సంస్థను నిర్వహిస్తున్నాడు. షైన్.కామ్, టైమ్‌జాబ్స్.కామ్, నౌకరీ.కామ్ వెబ్‌సైట్ల ద్వారా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను కొనుగోలు చేస్తాడు. నోయిడాలో ఒక కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి.. అక్కడ టెలికాలర్స్‌తో ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారికి ఫోన్లు చేయించి, అరబ్ దేశాల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మిస్తూ రిజిస్ట్రేషన్, వీసా ఫీ. జీఎస్టీ.. ఇలా రకరకాల ఫీజులు వసూలు చేసి చివరకు బాధితులను నట్టేట ముంచేస్తుంటారు. ఇలా హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడికి సౌదీ అరేబియలోని జీజాన్ యూనివర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మించి రూ. 4.71 లక్షలు వసూలు చేసి, మోసం చేశాడు. దీనిపై బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ బోస్‌కిరణ్ బృందం దర్యాప్తు చేపట్టి, ఢిల్లీలో నిందితుడు నిశాంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఆరు ల్యాప్ టాప్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు, 5 వైర్‌లెస్ ఫోన్లు, ఆరు డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీఓల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): సిటీ పోలీసు విభాగంలో ఖాళీగా ఉన్న 120 ప్రత్యేక పోలీసు అధికారుల (ఎస్పీఓ) నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్(కార్) హెడ్ క్వార్టర్స్ అదనపు సీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన.. తెలంగాణ రాష్ట్రంలోని మాజీ సైనికులు, మాజీ పారా మిలిటరీ బలగాలు, రిటైర్డు పోలీసు సిబ్బంది మాత్రమే అర్హులని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని, మాజీ సైనికుల వయస్సు ఆగస్టు ఒకటి, 2024 నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువగా ఉండాలని, గరిష్ఠ వయో పరిమితి 61 సంవత్సరాలని తెలిపారు. నెలకు రూ. 26 వేల గౌరవ వేతనం ఉంటుందని, సెలవుల అర్హత లేదని వివరించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన వారు పేట్లబుర్జులోని కార్ హెడ్ క్వార్టర్స్‌లో వ్యక్తిగతంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంపీ ఈటల ఫేస్ బుక్ హ్యాక్

సీసీఎస్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది. ఫేస్‌బుక్‌ను హ్యాక్ చేసిన నేరగాళ్లు.. డాలర్లు కావాలంటూ పలువురిని కోరడంతో ఇది సైబర్‌నేరగాళ్ల పనేనని గుర్తించారు. దీంతో ఎంపీ సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు మంగళవారం సీసీఎస్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఏసీపీ చాంద్ బాషా నేతృత్వంలోని బృందం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టింది. ఇటీవల ఫేస్‌బుక్, వాట్సాప్‌లు ఎక్కువగా హ్యాక్ అవుతున్నాయని, అందులో భాగంగానే ఎంపీ ఫేస్‌బుక్ కూడా హ్యాకింగ్ అయి ఉంటుందని సైబర్‌క్రైమ్ పోలీసులు భావిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు.

పట్టాలు దాటుతుండగా..

మారేడ్‌పల్లి, జూలై 9: పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని ఓ మహిళను రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బొల్లారం రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని ఓ మహిళ (45) పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా మొహర్రం నిర్వహిద్దాం

సమన్వయ సమావేశంలో సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): మొహర్రం, బీబీకా ఆలం ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొహర్రం సందర్భంగా మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆయా శాఖల అధికారులు, ఓల్డ్‌సిటీ ఎమ్మెల్యేలు, షియా ముస్లిం మత పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. మొహర్రం ఊరేగింపులో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడటంతో పాటు పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీజేల హోరు.. అశ్లీల నృత్యాల జోరు

మొయినాబాద్, జూలై 9 : అర్ధరాత్రి సమయంలో డీజేల హోరు.. యువతులు అర్ధనగ్నంగా నృత్యాలు చేస్తుండగా ఎస్వోటీ పోలీసులు దాడి చేసి ముజ్రా పార్టీని భగ్నం చేశారు. ఆరుగురు యువకులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నా రు. మండలంలోని సురంగల్ గ్రామ సమీపంలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతా నికి చెందిన రెహాన్‌సిద్ధ చౌహాన్ ఆటోడ్రైవర్. అతడి భార్య ఆర్కెస్ట్రా సింగర్‌గా పని చేస్తున్నది. కాగా, రోహన్ టోలిచౌకి ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులతో కలిసి ముజ్రా పార్టీ నిర్వహించేందుకు సురంగల్ సమీపంలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న ఆర్ఎస్ ఫామ్ హౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. ఆర్కెస్ట్రా డ్యాన్సర్లుగా పనిచేసే ఢిల్లీకి చెందిన ఇద్దరు యువతులు, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు యువతులను తీసుకుని సోమవారం రాత్రి ఆ ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో డీజేల సౌండ్ అధికంగా పెట్టి అర్ధనగ్నంగా.. అసభ్యంగా నృత్యాలు చేస్తుండగా.. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఆ ఫామ్‌హౌస్‌పై దాడి చేసి.. నలుగురు యువతులు, ఆరుగురు యువకులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు కార్లు , మ్యూజిక్ సిస్టం, సెల్‌ఫోన్లు, రూ.12,160 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. తీసుకోలేదని తేలింది. కేసు నమోదు చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



మేడ్చల్ తహసీల్దార్‌పై సీఎంకు ఫిర్యాదు

మేడ్చల్, జూలై 9: వారసత్వంగా రావాల్సిన భూమి రాకుండా చేయడంతో పాటు.. అభ్యంతరాలు పట్టించుకోకుండా ఇతర వారసులకు మాత్రమే పట్టా చేసిన మేడ్చల్ తహసీల్దార్‌పై మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌కు చెందిన మహిళ సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. గిర్మాపూర్‌నకు చెందిన బాసురాది ఉమకు బాసురాది మల్లేశ్‌తో వివాహం జరిగింది. మల్లేశ్ తండ్రికి బాసురాది బాలయ్యకు వీరయ్య, కృష్ణ మరో ఇద్దరు కుమారులున్నారు. బాలయ్యకు సర్వే నంబర్ 41లో 8 గుంటల భూమి ఉంది. అయితే ఉమ భర్త మల్లేశ్‌తో పాటు, బాలయ్య మరో కుమారుడు కృష్ణ చనిపోగా.. తహసీల్దార్ మాత్రం వీరయ్య, కృష్ణ భార్య కళావతి పేర్లపై మాత్రమే 8 గుంటల భూమిని పట్టా చేశారని ఆరోపించారు. వారసత్వంగా రావాల్సిన భూమిపై తహసీల్దార్‌కు అభ్యంతరాలు తెలుపుతూ లిఖితపూర్వకంగా తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని.. కోర్టుకు వెళ్లమని సలహా ఇచ్చారన్నారు. ఇద్దరు వారసులకు పట్టా చేసిన సమయంలో నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. తాను ఒంటరి మహిళనని, తనకు రావాల్సిన భూ వాటా కోసం కోర్టుల చుట్టూ తిరిగే ఆర్థిక స్థోమత లేదన్నారు. తనకు అన్యాయం చేసిన తహసీల్దార్‌పై చర్య తీసుకొని, న్యాయంగా రావాల్సిన భూ వాటాను ఇప్పించాలని ఫిర్యాదులో ఆమె కోరారు.

శానిటేషన్ విభాగంలో..1050 ఖాళీల భర్తీకి అనుమతి ఇవ్వండి

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని, 1050 మంది వర్కర్స్ నియామకానికి అనుమతి ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. పారిశుధ్య విభాగంలో స్వీపర్ల సంఖ్య తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. స్వీపర్ల శాశ్వత ఖాళీల భర్తీపై ఉన్న నిషేధం (బ్యాన్)పై ప్రభుత్వం నుంచి సడలింపు ఉత్తర్వులు రావాలని, అప్పటి వరకు శానిటరీ వర్కర్ గ్రూప్ ద్వారా ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ వర్కర్ క్లాస్- 4 ఉద్యోగుల ఖాళీతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో చోరీ

100 తులాల బంగారం పోయిందని.. బాధితుల ఫిర్యాదు

మణికొండ, జూలై 9: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంట్లో దొంగలు పడి 100 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బండ్లగూడ జాగీరు పరిధిలోని గంధంగూడ కృష్ణారెడ్డినగర్ కాలనీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రవిబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. వారం రోజుల కిందట ఇంటికి తాళం వేసి విజయవాడకు వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. ఇంట్లో దాచిన బంగారం, నగదు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. తాళం విరిగిపోయి కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెంటనే క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలను సేకరించారు. బాధితులిచ్చిన ఫిర్యాదులో 100 తులాల బంగారం, నగదు, ఇతర వస్తువులు పోయినట్లు పేర్కొన్నారు. అయితే, 15 తులాల బంగారం మాత్రమే దొంగతనానికి గురైనట్టు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్టు పేర్కొన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

బీఓఐలో ఈ నెల 11న సంఝౌతా దినం..

జూబ్లీహిల్స్, జూలై 9: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ)లో సంఝౌతా దినాన్ని ఈనెల 11న నిర్వహించనున్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ కింద పాత రుణాలు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వల్ప, మధ్య కాలిక రుణాలే కాకుండా దీర్ఘకాల రుణ గ్రహీతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జోయాలుక్కాస్‌లో 14 వరకు ఆఫర్లు..

జూబ్లీహిల్స్, జూలై 9: నాణ్యత, నమ్మకానికి మారుపేరుగా నిలిచే జోయాలుక్కాస్‌లో జూలై 14 వరకు ఆకర్షణీయమైన ఆఫర్స్ అందిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ, చైర్మన్ జోయాలుక్కాస్ వెల్లడించారు. గోల్డ్, డైమండ్స్, ప్రెషస్, సిల్వర్ ఆభరణాల మజూరీ ఛార్జీ (వీఏ)లపై ఫ్లాట్ 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌లో ఉచిత స్కిల్ ఎడ్యుకేషన్ మేళా

కాచిగూడ, జూలై 9: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వారం రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత ఆన్‌లైన్ స్కిల్ ఎడ్యుకేషన్ మేళాను నిర్వహిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీమాన్ రెడ్డి తెలిపారు. కాచిగూడలో ఆయన మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు మంగళవారం తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 95058 00050, www.nationalskilla cademy.inలో సంప్రదించవచ్చని కోరారు.

పోలీసింగ్‌లో లింగ వివక్షకు తావు లేదు

నేషనల్ ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ

జెండర్ సెన్సిటైజేషన్‌పై పోలీసు అకాడమీలో వర్క్‌షాపు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : పోలీసింగ్‌లో లింగ ఆధారిత వివక్షకు, పక్షపాతానికి తావులేదని, ప్రతి కేసునూ క్షుణ్ణంగా పరిశీలించాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల పట్ల జరుగుతున్న నేరాల్లో చురుగ్గా వ్యవహరించాలని నేషనల్ ఉమెన్ కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ కోరారు. రాష్ట్ర పోలీసు అకాడమీలో 'జెండర్ సెన్సిటజేషన్ ఫర్ పోలీస్ పర్సనల్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాపు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేఖాశర్మ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో పోలీసులు మాట్లాడే తీరు.. వారిని ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. వారితో మర్యాదగా మాట్లాడితే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఏదో ఒకరోజు మహిళలు, చిన్నారుల పట్ల నేరాలు తగ్గాయనే వార్తలు నేషనల్ కమిషన్ వింటుందనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. కార్యాలయాల్లో మహిళలు తమ బాధ్యతలను నిర్వర్తించేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. అందులో భాగంగానే పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీలకు సకల సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ వర్క్‌షాపులో మహిళలపై జరుగుతున్న నేరాలను సమర్థవంతంగా అరికట్టడంలో పోలీసుల పాత్రపై డా.బి.సంధ్య ఐపీఎస్ (రిటైర్డ్), తునికా, కౌన్సెలర్ ఎన్‌సీడబ్ల్యూ, ఏడీజీ మహేశ్ భగవత్, సైకాలజిస్టు గౌరవ్ గిల్, సైబర్ లా నిపుణురాలు సోనాలి పట్నాకర్ మాట్లాడారు.